సాక్షి విశాఖపట్నం

సోమవారం । 8 । జూలై । 2024



ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

జిల్లాలో యూపీఎస్సీ ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 8లో



కృత్రిమ అవయవాల పంపిణీ

నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. 8లో



నాకౌట్‌కు కింగ్స్, వారియర్స్

ఏపీఎల్ మూడో సీజన్‌లో రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్ నాకౌట్‌కు చేరుకున్నాయి. 8లో

కార్యకర్తలకు అండగా ఉంటాం..



వైఎస్సార్, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, పార్టీ నేతలు

- ఎవరూ అధైర్యపడొద్దు..
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి

కొమ్మాది : వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అమానుషంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను ఎండగట్టడంతోపాటు ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఎండాడలో గల జిల్లా పార్టీ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా డా.బి.ఆర్.అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిక్షణం తెలుసుకుంటున్నారని తెలిపారు. నాయకులంతా కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో మళ్లీ మనం అధికారంలోకి వస్తామని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, పార్టీ అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, చింతలపూడి వెంకటరామయ్య, సమన్వయకర్తలు మీసాల భరత్, అనురాధ, జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే మత్స్య లింగంను సత్కరించారు.

వైఎస్సార్ జయంతిని వాడవాడలా నిర్వహించండి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని, సేవా కార్యక్రమాలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు.

కార్యకర్తకు బాసటగా..



అప్పారావుకు చెక్కు అందజేస్తున్న వైవి సుబ్బారెడ్డి

టీడీపీ గుండాల దాడిలో గాయపడిన జీవీఎంసీ 9వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఉమ్మిడి అప్పారావుకు పార్టీ బాసటగా నిలిచింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.50 వేల చెక్కును ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి అందజేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఉమ్మిడి దాసు, కార్పొరేటర్ స్వాతి దాస్ పాల్గొన్నారు.

జగన్నాథుడి జనయాత్ర



ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ స్వామి రథయాత్ర

నగరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సంకీర్తనలు.. కోలాటాలు. భజనలు.. విష్ణు సహస్రనామ పారాయణం.. వేదమంత్రాలు.. మంగళధ్వని.. ఆహ్లాదకర వాతావరణంలో జగన్నాథ స్వామి రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. నగరంలో అతిపురాతన టౌన్ కొత్త రోడ్డు జగన్నాథస్వామి ఆలయం, జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిర్, ఇస్కాన్ నగర శాఖ, ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొని.. స్వామి సేవలో పునీతులయ్యారు.



ఉప్పొంగిన భక్తిభావం: టౌన్‌కొత్తరోడ్డులో వేలాది మంది భక్తుల నడుమ సాగుతున్న రథయాత్ర 8లో

ఆ టీడీపీ నేతతో బతుకు ‘గోవిందా’

- బయటపడుతున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి దౌర్జన్యాలు
- అప్పులు తీర్చేస్తానంటూ ఇంటిని కొట్టేసిన వైనం?
- కిడ్నాప్ వ్యవహారంలోనూ కార్పొరేటర్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు

గాజువాక/అక్కిరెడ్డిపాలెం: విచక్షణకు.. సలక్షణమైన అలవాట్లకు మారుపేరు కాకి.. ప్రకృతిలో ఎన్ని మార్పులు వచ్చినా.. ప్రకృతి ధర్మాన్ని మార్చుకోని ఒకే ఒక పక్షి కాకి.. కానీ ఈ ‘కాకి’మాత్రం అందుకు భిన్నం.. తన పనుల కోసం పార్టీలు మారిపోతుంది. ఓటేసిన ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటుంది. నమ్మించి గొంతు కోసేస్తుంది. పారిశ్రామిక నగరంలో ఉండే ‘కాకి’ తలచుకుంటే.. అప్పటి వరకూ హాయిగా ఉన్న ఆ కుటుంబాల బతుకులు ‘గోవిందా’.! వివరాలివీ..

జీవీఎంసీ 69వ వార్డు కార్పొరేటర్‌గా టీడీపీ నుంచి విజయం సాధించిన కాకి గోవింద రెడ్డి.. నెల తిరగకముందే వైఎస్సార్‌సీపీతో అంటకాగారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ 2021 ఆగస్టులో టీడీపీ నుంచి సస్పెండ్ అయ్యారు. అన్నం పెట్టిన టీడీపీకి సున్నం రాసి.. తన సొంత



మీడియాతో మాట్లాడుతున్న కొల్లి సత్యవతి

పనులు చక్కబెట్టుకునేందుకు అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీతో చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. గోవిందరెడ్డి అరాచకాలు తెలియడంతో వైఎస్సార్ సీపీ నేతలు సైతం అతన్ని దూరం పెట్టారు. దీంతో.. మళ్లీ టీడీపీ పంచన చేరి.. తన దౌర్జన్యాలను మరింత విచ్చలవిడిగా చేయడం ప్రారంభించారు. తన వార్డు పరిధిలో ఏం జరిగినా.. ప్రతి పనికీ గోవింద్ ట్యాక్స్ కట్టాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. దీంతో ఆ కార్పొరేటర్ దౌర్జన్య దాహానికి వార్డు ప్రజలు సతమతమవుతున్నారు. తాజాగా ఓ కుటుంబాన్ని బెదిరించి.. అప్పులు తీర్చేస్తానంటూ నమ్మబలికి.. వారి ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నారు. తీరా రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక డబ్బులు ఇవ్వాలని అడిగిన మహిళపై దౌర్జన్యానికి పాల్పడి మెడపట్టుకు గెంటేశారు. దిక్కున్న చోట చెప్పుకో



గాజువాక పోలీస్ స్టేషన్ వద్ద చిట్టీల బాధితులు

అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అదే విధంగా గాజువాకలో చిట్‌ఫండ్ వ్యాపారి కిడ్నాప్ వ్యవహారంలోనూ కార్పొరేటర్ గోవిందరెడ్డి హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

డబ్బులు ఎగ్గొట్టి.. దాడి చేశాడు

తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు ఎగ్గొట్టడమే కాకుండా.. తనపై దాడి చేశాడని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డిపై బాధిత మహిళ కొల్లి సత్యవతి ఆరోపించింది. జీవీఎంసీ 68వ వార్డు తుంగ్లాంలో కొల్లి సత్యవతి చిట్టీలు నిర్వహిస్తోంది. తుంగ్లాంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు వంద మందికి పైగా ఆమె వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో చిట్టీలు కడుతున్నారు. కాగా.. చిట్టీలు పాడిన వారికి సత్యవతి ఏప్రిల్ నుంచి డబ్బులు చెల్లించకపోవడంతో ఆమెను బాధితులు నిలదీశారు. దీంతో సత్యవతి తన ఇల్లును కార్పొరేటర్ గోవిందరెడ్డికి రూ.1.45 కోట్లకు అమ్మకానికి పెట్టింది. ఈ డబ్బును చిట్టీలు కడుతున్న వారికి సెటిల్ చేయాలని గోవిందరెడ్డిని కోరింది. అయితే గోవింద రెడ్డి తన ఇల్లును రిజిస్ట్రేషన్‌ను చేయించుకుని డబ్బులు ఇవ్వలేదని, పైగా తనపై దాడి చేశాడని ఆమె ఆరోపించింది. కాగా.. చిట్టీలు కట్టేవారికి ఆమె రూ.7 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. డబ్బులు ఇవ్వాలని ఆమెను బాధితులు నిలదీయడంతో కార్పొరేటర్ గోవిందరెడ్డి ఇంటికి వస్తే..సెటిల్ చేస్తానని చెప్పడంతో అందరూ ఆదివారం కార్పొరేటర్ ఇంటికి చేరుకున్నారు. అయితే తనకు ఈ విషయం తెలియదని కార్పొరేటర్ చెప్పడంతో గందరగోళం నెలకొంది. దీంతో బాధితులు గాజువాక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తమకు న్యాయం చేయాలని సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ కొల్లి సత్యవతిని పిలిపించి వివరాలు సేకరించారు.

చిట్టీల వ్యవహారం నాకు తెలియదు

‘చిట్టీల వ్యవహారం నాకు తెలియదు. సత్యవతి రూ.7 కోట్లు ఎగ్గొటి నన్ను కట్టమని చెప్పింది. దీంతో నేను అయోమయానికి గురయ్యాను. ఆమె వద్ద నా సోదరి ఇల్లు కొనుగోలు చేసింది. ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని రూ.1.45 కోట్లు చెల్లించేశాం. పార్టీలో నేను ఎదగకుండా కొందరు చేస్తున్న కుట్ర ఇది.’ అని కార్పొరేటర్ గోవిందరెడ్డి తెలిపారు.

జూన్ రిపోర్ట్

66 ఛేదించిన కేసులు

99 జరిగిన దొంగతనాలు



స్వాధీనం చేసుకున్న బైక్‌లు పరిశీలిస్తున్న సీపీ బాగ్చీ, క్రైం డీసీపీ వెంకటరత్నం తదితరులు



బాధిత వ్యక్తికి నగలు అందజేస్తున్న సీపీ బాగ్చీ



పోయిన తన మొబైల్ చూసుకుంటున్న యువతి

- మొత్తంగా 80 కేసులను ఛేదించి.. రూ.37,12,715 సొత్తు స్వాధీనం
- నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: నగర ప్రజలు పోలీసులకు సహకరించి.. నేరాల నియంత్రణతో భాగస్వాములు కావాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. నగర పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన జూన్ రికవరీ మేళాలో ఆయన మాట్లాడారు. జూన్‌లో 99 దొంగతనాలు జరిగాయని, సుమారు రూ.78,60,266 విలువ గల సొత్తు చోరీకి గురైందన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప, క్రైం డీసీపీ వెంకటరత్నం ఆధ్వర్యంలో క్రైం సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి 80 కేసులను ఛేదించారని వెల్లడించారు. ఈ కేసుల్లో 69 మంది నిందితులను అరెస్ట్ చేసి.. వీరి వద్ద నుంచి రూ.37,12,715 విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పోలీసులు ఛేదించిన 80 కేసుల్లో 66 జూన్‌లో జరిగినవి కాగా.. మిగిలినవి పాత కేసులన్నారు. ఒక దోపిడీ, మూడు పగటిపూట, 17 రాత్రి పూట ఇంటి దొంగతనం కేసులు, ఆటో, కారు, 16 సాధారణ దొంగతనం కేసులు, 9 చైన్ స్నాచింగ్, 24 బైక్, ఏడు వైర్ దొంగతనం కేసులు, ఒక పిక్ పాకెటింగ్ తదితర కేసులను పోలీసులు ఛేదించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తులో 981.93 గ్రాముల బంగారం, 501.36 గ్రాముల వెండి వస్తువులు, రూ.7,94,050 నగదు, 24 మోటారు సైకిళ్లు, ఆటో, కారు, 12 మొబైల్ ఫోన్లు, కెనాన్ కెమెరా, యాంప్లిఫైర్, కాపర్ తీగలు 135.9 కేజీలు, అల్యూమినియం తీగలు 20 కేజీలు, రిఫ్రిజిరేటర్, 32 అంగుళాల టీవీ, ఉషా మిక్సర్ ఉన్నట్లు సీపీ వివరించారు.

చాట్‌బోట్ ద్వారా సెల్‌ఫోన్ల రికవరీ

చాట్‌బోట్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు జూన్‌లో రూ.41.25 లక్షల విలువైన సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. వీటితో కలిపి ఇప్పటివరకు రూ.4.17కోట్ల విలువ గల 2,784 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు వివరించారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే 94906 17916కు గానీ, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఐఎంఈఐ నంబర్, వివరాలు తెలియజేయాలని కోరారు. 2022లో 820 మొబైళ్లకు గానూ 660, 2023లో 678 మొబైళ్లకు గానూ 423 రికవరీ చేశామని చెప్పారు.

సమాచారం ఇవ్వండి

నగర ప్రజలు అత్యవసర సమయాల్లో దూర ప్రాంతాలకు కుటుంబంతో కలిసి వెళ్లినప్పుడు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీపీ సూచించారు. అప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జూన్‌లో 338 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 120 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

సిబ్బందికి అభినందనలు

కేసులు ఛేదించడంలో చాకచక్యంగా విధులు నిర్వర్తించిన సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులను కమిషనర్ అభినందించారు. వారికి క్యాష్ అవార్డులు అందజేసి ప్రోత్సహించారు. బాధితులకు రికవరీ చేసిన సొత్తును సీపీ అందజేశారు. సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప, క్రైం డీసీపీ కె.వెంకటరత్నం, క్రైం ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మీ బిల్లుని మీరే లెక్కించుకోవచ్చు

- ఈస్టర్న్ పవర్ యాప్‌లో మరిన్ని ఫీచర్లు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ఏపీఈపీడీసీఎల్ కొత్తగా ప్రవేశపెట్టిన ‘ఈస్టర్న్ పవర్’ మొబైల్ యాప్‌లో సరికొత్త ఫీచర్లు జత చేసినట్లు ఆ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగదారుడి 16 అంకెల సర్వీస్ నంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చన్నారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌లో ‘బిల్ పే’ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎలాంటి అదనపు రుసుం లేకుండా సులభతరంగా చెల్లించుకోవచ్చని తెలిపారు. వినియోగదారుడి సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకునేలా సరికొత్త ఫీచర్లు తీసుకొచ్చామని వివరించారు. ‘మై యూసేజ్’ ఆప్షన్ ద్వారా ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును లెక్కించుకోవచ్చన్నారు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయమై ఆర్బీఐ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే ద్వారా బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ నుంచి కూడా బిల్లులు చెల్లించుకునే సౌకర్యం ఉందన్నారు. మొబైల్ యాప్‌లో గానీ వెబ్‌సైట్‌లో గానీ బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు యూపీఐ యాప్‌లతో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డులు కూడా వాడుకోవచ్చని సీఎండీ స్పష్టం చేశారు.

ఉచిత ఇసుకంటూ ఊదరగొట్టి..

- అగనంపూడి డిపో వద్ద టన్ను రూ.1,394
- భీమిలి డిపో వద్ద టన్ను రూ.758

8లో

జగన్నాథుడి జనయాత్ర


రథంపై బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు


భక్తులకు హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు


కోలాటం ఆడుతున్న చిన్నారులు

డాబాగార్డెన్స్: టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి రథయాత్ర ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు ప్రారంభమైంది. ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, పూర్ణామార్కెట్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా టర్నర్ చౌల్ట్రీ వరకు కనులపండువగా ఈ యాత్ర సాగింది. అనంతరం బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడిని టర్నర్ చౌల్ట్రీలోని కల్యాణ మండపంలోకి ఆహ్వానించారు. అక్కడ రోజుకో దివ్యావతారంతో జగన్నాథుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవంలో ముందుగా దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాత్రను ప్రారంభించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ ప్రధాన అర్చకులు రంగానాథాచార్యులు, జగన్నాథాచార్యులు, యేడిద సురేష్, కార్పొరేటర్లు, పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకుని రథయాత్రలో పాల్గొన్నారు.


ఇస్కాన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో కనులపండువగా సాగుతున్న రథయాత్ర

రథంపై జగన్నాథుడు.. భక్తులే రథచాలకులు

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ స్వామి రథయాత్ర ఘనంగా జరిగింది. దసపల్లా హిల్స్‌లోని జగన్నాథ స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన రథయాత్ర సిరిపురం, హెచ్‌పీసీఎల్, ఏయూ అవుట్ గేట్, చిన్నవాల్తేరు, వీఎంఆర్డీఏ పార్క్, శాంతి ఆశ్రమం మీదుగా లాసన్స్ బే కాలనీలోని గుండిచా ఆలయం వరకు సాగింది. ఈ యాత్రలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఒడిశా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఈ సందర్భంగా సమాజ్ అధ్యక్షుడు జితేంద్ర కుమార్ నాయక్ మాట్లాడుతూ గుండిచా ఆలయంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నేటి నుంచి దశావతారాలు

టర్నర్ చౌల్ట్రీ వేదికగా బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు దశావతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 8న మత్స్యావతారం, 9న కూర్మావతారం, 10న వరహావతారం, 11, 12న నృసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న శ్రీరామవతారం, 16న బలరామ..శ్రీకృష్ణావతారం, 17న తొలి ఏకాదశి రోజున శేష పాన్పు అవతారంలో దర్శనమివ్వనున్నారు. 18 న ఉదయం 9.15 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి స్వామిని రథంపైకి తీసుకురానున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ సత్రం కల్యాణ మండపం నుంచి టౌన్‌కొత్త రోడ్డు జగన్నాథస్వామి ఆలయం వరకు తిరుగు రథ యాత్ర నిర్వహిస్తారు. 19న ఉదయం సంప్రోక్షణ అనంతరం పీఠారోహణం, స్వామిని యథాస్థానానికి చేరుస్తారు.

కదిలిన రథం.. కదిలొచ్చిన భక్తజనం

బీచ్‌రోడ్డు: సాగర్‌నగర్ ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథుడి రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. సాగర్‌నగర్ ఇస్కాన్ శాఖ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయి సేవని సారథ్యంలో మూడు రథాలపై జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి అధిష్టించగా.. వేద మంత్రోచ్చరణలు, హరినామ సంకీర్తనలతో రథ యాత్ర ప్రారంభమైంది. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, సెంచూరియన్ వర్సిటీ కులపతి జి.ఎస్.ఎన్.రాజు, సాయి ప్రియ రిసార్ట్స్ ప్రసాద్, పైడా కృష్ణ ప్రసాద్ స్వామికి హారతి ఇచ్చి.. కొబ్బరికాయలు కొట్టి రథయాత్రను ప్రారంభించారు. వీఎంఆర్డీఏ పార్కు నుంచి బయలుదేరిన యాత్ర హరే కృష్ణ మహామంత్ర సంకీర్తనలు, కోలాటం, భజనలు, జై జగన్నాథ్ నామస్మరణతో వైఎంసీఏ, కాళీమాత ఆలయం, రామకృష్ణా బీచ్, రామకృష్ణామిషన్ మీదుగా సిరిపురం గురజాడ కళాక్షేత్రం వరకు సాగింది. అనంతరం గురజాడ కళాక్షేత్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథుడి ఔన్నత్యంపై సాంబదాస్, జగన్నాథుని లీలలపై మాతాజీ నితాయి సేవిని ప్రవచించారు. భక్తులు తయారు చేసిన 1,008 రకాల ప్రసాదాలను నైవేద్యంగా స్వామికి సమర్పించారు. అనంతరం భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ శాఖ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయి సేవని మాట్లాడుతూ విశాఖ నగరంలో వరసగా 17వ సారి అత్యంత వైభోవపేతంగా రథయాత్ర నిర్వహించినట్టు చెప్పారు. రథయాత్ర అలంకరణకు ఒడిశాలోని పిప్పిలి నుంచి ప్రత్యేక సామగ్రి తీసుకొచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి, బెంగాల్, ఒడిశా నుంచి వచ్చిన భక్తుల నృత్యాలు, కోలాట మండలాలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, వంశీకృష్ణ ప్రభు, ఇస్కాన్ జీవితకాల సభ్యులు, అర్చకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యే గణబాబు


ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో..

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల చించివేత


అక్కయ్యపాలెం హైవే వద్ద ఫ్లెక్సీ చింపేస్తున్న టీడీపీ నాయకులు

సీతంపేట: అధికార దర్పంతో టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. అడిగే వారు లేరని ధీమాతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. మహానేత వైఎస్సార్ జయంతి పురస్కరించుకుని అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని టీడీపీ నాయకులు ఈతలపాక సుజాత, నగేష్ చించివేశారు. ఇదేమిటని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. వాస్తవానికి అక్కడ ఏర్పాటు చేసిన హోర్డింగ్ పెద్దిశెట్టి ఉషశ్రీది కాగా, ఎన్నికల తర్వాత టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకుంటామని 26వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్ అడిగితే ఆమె సరే అన్నారు. ప్రమాణ స్వీకారం అయ్యాక తొలగిస్తామన్నారు. నెల రోజులు గడిచినా కానీ తియ్యలేదు. ఆదివారం వైఎస్సార్ జయంతి అని పాత ఫ్లెక్సీ తొలగించి కొత్త ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే టీడీపీ నాయకులు రాద్ధాంతం చేశారు. పోలీసుల సమక్షంలోనే చింపివేశారు. పైగా టీడీపీ ఫ్లెక్సీ చింపేశారని వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు జోక్యంతో గొడవ సద్దు మణిగింది. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకుని వారం తర్వాత తొలగించాలని చెప్పారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను అడ్డుకున్న కూటమి నాయకులు


తొలగిస్తున్న వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ

తగరపువలస : వైఎస్ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఫ్లెక్సీలను కడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు కూటమి నాయకులు అడ్డుతగిలారు. వాస్తవానికి చిట్టివలస జ్యూట్‌మిల్లుకు చెందిన స్థలంలో గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులే ఫ్రేమ్ తగిలించి ఫ్లెక్సీలు కట్టుకునేవారు. వారికి చెందిన ఫ్రేమ్ మీద ఇటీవల టీడీపీ నాయకులు ఫ్లెక్సీ తగిలించారు. ఇప్పుడు వైఎస్సార్ జయంతి సందర్భంగా తగిలిస్తున్న ఫ్లెక్సీని తొలగించాలని వందలాది మంది కూటమి నాయకులు వచ్చి గలాటా సృష్టించడానికి ప్రయత్నించారు. పోలీసుల రాకతో కూటమి నాయకులు పలాయనం చిత్తగించారు. తమ ఫ్రేమ్‌పై తమ ఫ్లెక్సీని కట్టనివ్వకపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత ఇసుకంటూ ఊదరగొట్టి..

- అగనంపూడి డిపో వద్ద టన్ను రూ.1,394
- భీమిలి డిపో వద్ద టన్ను రూ.758

అగనంపూడి: ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఉచిత ఇసుక సరఫరా ధరలను జిల్లా కలెక్టర్ సారథ్యంలో కమిటీ ఖరారు చేసినట్టు విశాఖ ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ చెప్పారు. అగనంపూడి ఇసుక డిపో వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల నుంచి ఇసుకను విశాఖ జిల్లా అవసరాల నిమిత్తం రవాణా చేస్తున్నామన్నారు. ఆయా జిల్లాల నుంచి ఇక్కడికి తీసుకురావడానికి అయిన వ్యయాన్ని లెక్కించి అగనంపూడిలో టన్ను ధర రూ.1396, భీమిలి డిపో వద్ద రూ.758గా నిర్ణయించామన్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక అమ్మకాలు జరుగుతాయని చెప్పారు. ఇసుక కావల్సిన వారు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని, ఒక ఆధార్ కార్డుపై కేవలం 20 టన్నుల ఇసుకను సరఫరా చేయనున్నామన్నారు. ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవడంతోపాటు డిజిటల్ విధానంలో నగదు చెల్లింపులు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఇసుక డిపోలకు ఇన్‌చార్జులుగా డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారిని నియమించడం జరుగుతుందన్నారు. అలాగే ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక నిల్వలు కల్గి ఉన్నా, రవాణా చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ శ్రీవల్లీ, గనులు, భూగర్భశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, ఆర్‌ఐ మహేష్, వీఆర్వో స్వరూప్ పాల్గొన్నారు.


అగనంపూడి ఇసుక డిపో వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

ఫ్రీ కాదు.. పే చేయాల్సిందే..

ఉచిత ఇసుకంటూ టీడీపీ కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊదరగొట్టారు. తీరా ఇసుక విధానం ప్రకటించిన తరువాత వాస్తవం కూటమి ప్రభుత్వ పెద్దలకు బోధపడినట్టు ఉందని నిర్మాణదారులు పెదవి విరుస్తున్నారు. గతంతో పోల్చితే కేవలం ఆరు రూపాయలే టన్నుకు తగ్గించడం చూస్తుంటే ఇసుక విధానంపై ఇప్పటివరకు టీడీపీ వాటి మిత్రపక్షాలు అసత్య ఆరోపణలు చేశారనే విషయం తేటతెల్లమౌతుందని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు.

వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం-2గా పవన్‌కుమార్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్-2గా 2016 బ్యాచ్ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌కు చెందిన అధికారి కె.పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పవన్‌కుమార్ నైపర్, మొహాలిలో ఎం.ఫార్మ్, ఎంఎ పూర్తి చేశారు. హుబ్లీ డివిజన్, సౌత్ వెస్ట్రన్ రైల్వే, ఫ్రైట్ ఆపరేషన్స్ విభాగంలో ఏరియా ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఇప్పటివరకు వాల్తేర్ డివిజన్‌లో డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎ.అవినాష్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (జనరల్)గా పదోన్నతి పొందారు.

మావూరి వెంకటరమణకి మాతృవియోగం


మావూరి వీరమణమ్మ

జగదాంబ : సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాతృమూర్తి మావూరి వీరమణమ్మ(76) ఆదివారం సాయంత్రం స్వర్గస్తులయ్యారు. ఆమె భర్త మావూరి సత్యనారాయణ గతంలో స్వర్గస్తులయ్యారు. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మావూరి వెంకటరమణకు ఆయా పార్టీ నాయకులు, వ్యాపారులు కలసి ప్రగాఢ సంతాపం తెలిపారు.

350 మందికి కృత్రిమ అవయవాల పంపిణీ

సీతంపేట: రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం పోర్టు స్టేడియంలో వికలాంగులకు కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ విశాఖలో సుమారు 350 మందికి ఈ శిబిరం ద్వారా ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. నారాయణ సేవా సంస్థాన్ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో 1100 పడకల ఆసుపత్రి నిర్వహిస్తున్నామని, జర్మనీ టెక్నాలజీతో రూపొందిస్తున్న కృత్రిమ కాళ్లు, చేతులు తయారు చేసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. గత 39 ఏళ్లుగా రోజూ 80 నుంచి 100 ఆపరేషన్లు చేయడంతో పాటు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్ కందుల నాగరాజు, విజయానంద్ రెడ్డి, బీజేపీ శ్రీకాకుళం ఇన్‌చార్జి బాగ్‌చంద్ అగర్వాల్, సుమన్ ప్రకాశ్, రాజ్‌కుమార్ శర్మ, అశోక్ అగర్వాల్, కె.గుప్త, బొడ్డేటి కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.


కృత్రిమ అవయవాలు అమర్చిన వారితో మాజీ ఎంపీ జీవీఎల్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు

నాకౌట్‌కు కింగ్స్, వారియర్స్


విజయానందంలో రాయలసీమ కింగ్స్ ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయలసీమ కింగ్స్‌తో పాటు వైజాగ్ వారియర్స్ జట్టు నాకౌట్‌కు చేరుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో ఈ జట్లు ప్రత్యర్థి జట్లపై విజయాలు సాధించి.. 12 పాయింట్లతో నాకౌట్‌కు చేరాయి. ఈ జట్లు ఇప్పటికే నాలుగేసి మ్యాచ్‌లు ఆడగా మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఉత్తరాంధ్ర లయన్స్ మూడు మ్యాచ్‌ల్లో ఎనిమిది పాయింట్లు సాధించగా నిరుటి ఫైనలిస్ట్ కోస్టల్ రైడర్స్ నాలుగు మ్యాచ్‌లాడి ఎనిమిది పాయింట్లతో చివరి మ్యాచ్‌కు సిద్ధమవుతోంది.

లయన్స్‌పై కింగ్స్ విజయం

పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్‌పై టాస్ గెలిచిన ఉత్తరాంధ్ర లయన్స్ బ్యాటింగ్‌కు దిగింది. ఇన్నింగ్స్ చివరి బంతికి 121 పరుగులు చేసి ఆలౌటైంది. ఓపెనర్లు కెప్టెన్ గుల్ఫామ్(4), తరుణ్(1) వికెట్లను ఐదు పరుగులకే లయన్స్ కోల్పోయింది. తపస్వి(20), రాహుల్(20) కాస్త నిలకడగా రాణించారు. వీరిద్దరూ జట్టు స్కోర్ 46 పరుగుల వద్దే పెవిలియన్‌కు చేరారు. ధీరజ్(11), తేజస్వి(12), పృథ్వీ(12) రవికిరణ్(13) రెండంకెల స్కోర్ చేయగలిగారు. గిరినాథ్, రఫీ, కుమార్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ చేసిన కింగ్స్ ఓపెనర్ హనీష్ రెడ్డి(5) ఎనిమిది పరుగుల స్కోర్ వద్ద పెవిలియన్‌కు చేరాడు. అతని స్థానంలో వచ్చిన రోషన్(8) 29 పరుగుల వద్ద రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఓపెనర్ ప్రశాంత్ నిలకడగా ఆడుతూ(51, 36 బంతుల్లోనే ఆరు ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీ చేశాడు. ఈ క్రమంలో బౌలర్ శ్రీనివాస్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరుకున్నాడు. వంశీకృష్ణ(20) 99 పరుగుల వద్ద నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. రోహిత్(26), కెప్టెన్ గిరినాథ్(9) జోడీ అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్నందించింది. దీంతో 17.3 ఓవర్లలో రాయలసీమ కింగ్స్ విజయలక్ష్యాన్నందుకుంది. లయన్స్ బౌలర్ శ్రీనివాస్ రెండు వికెట్లు తీశాడు.

టైటాన్స్‌పై వారియర్స్ గెలుపు

రెండో మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ టాస్ గెలిచి లక్ష్యఛేదనకే మొగ్గుచూపడంతో గోదావరి టైటాన్స్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బ్యాటింగ్ ప్రారంభించిన టైటాన్స్ ఓపెనర్ వంశీకృష్ణ డకౌట్‌గానే వెనుదిరగ్గా.. అతని స్థానంలో వచ్చిన హేమంత్(11) కూడా జట్టు స్కోర్ 19 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. ఓపెనర్ కెప్టెన్ జ్ఞానేశ్వర్(27) ఇన్నింగ్ సరిదిద్దే క్రమంలో నిలకడగా ఆడినా మరో ఎండ్‌లో పాండురంగరాజు డకౌట్‌గానే వెనుదిరిగాడు. దీంతో తొలి నాలుగు వికెట్లను 46 పరుగులకే కోల్పోయింది. ఈ దశలో సందీప్(37 నాటౌట్)కు ప్రసాద్(54, 33 బంతుల్లో మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లు) తోడై స్కోర్‌ను 136కు చేర్చాడు. శశికాంత్ ఐదు పరుగులే చేయగా విజయ్ అజేయంగా 14 పరుగులతో నిలిచాడు. చివరి ఓవర్లో 16 పరుగులు రాబట్టడంతో ఆరు వికెట్లకు 164 పరుగులకు టైటాన్స్ ఇన్నింగ్స్ ముగిసింది. సుదర్శన్, వై.రెడ్డి చెరో రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా వారియర్స్ ఓపెనర్ సుజాన్ ఐదు పరుగులు చేసి వెనుదిరగ్గా కెప్టెన్ భరత్ బ్యాటింగ్ వచ్చాడు. తొమ్మిది ఓవర్లకు 72 పరుగులు చేసిన స్థితిలో వర్షం కారణంగా ఆటకు అంతరాయం ఏర్పడింది. దీంతో డీఎల్ పద్ధతిలో 17 ఓవర్లకు ఆటను కుదించి విజయలక్ష్యాన్ని 141 పరుగులకు నిర్దేశించారు. భరత్ 29 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద శశికాంత్ బౌలింగ్‌లో హేమంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ అశ్విన్ హెబ్బర్‌కు తేజ తోడై స్కోర్‌ను పరుగులెత్తించారు. 15.5 ఓవర్లలో రెండు వికెట్లకు 145 పరుగులతో వైజాగ్ వారియర్స్ జట్టు విజయం సాధించింది. అశ్విన్ హెబ్బర్(43 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, మూడు సిక్సర్లతో) 75, తేజ (21 బంతుల్లో మూడు ఫోర్లు ఒక సిక్సర్‌తో) 32 పరుగులతోనూ అజేయంగా నిలిచి జట్టును నాకౌట్‌కు చేర్చారు.

మానవత్వం చాటుకున్న సీపీ


గాయపడిన తండ్రి, కుమారుడితో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మరోసారి మానవత్వం చాటుకున్నారు. సీతమ్మధారలోని ఎల్‌ఐసీ బిల్డింగ్ పక్కనే జీవన్ విశాఖ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ అలీమ్, అతని కుమారుడు(9) ద్విచక్ర వాహనంపై ఆదివారం టైకూన్ రోడ్డు నుంచి ఆశీలమెట్ట వైపు వస్తున్నారు. సంపత్ వినాయక ఆలయం సమీపంలో ఓ కారు వెళ్తుండగా.. బైక్ హ్యాండిల్ ఆ కారుకు తగిలింది. ఈ ఘటనలో అబ్దుల్, అతని కుమారుడు రోడ్డుపై పడి గాయాలపాలయ్యారు. అదే సమయంలో సిరిపురం నుంచి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆశీలమెట్ట వైపు వస్తున్నారు. ఈ ఘటనను చూసిన వెంటనే సీపీ తన కారు ఆపి, అక్కడకు చేరుకున్నారు. తర్వాత తన కారులో క్షతగాత్రులను సీతమ్మధారలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చేర్పించారు. వారికి చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు


విశాఖ ఉమెన్స్ కాలేజీ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

మహారాణిపేట: జిల్లాలో యూపీఎస్సీ ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరీంధ్రప్రసాద్ ఆధ్వర్యంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. యూపీఎస్సీ నియమించిన పరిశీలకురాలు హెచ్.వందన పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) పర్సనల్ అసిస్టెంట్స్, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్‌ఐసీ) నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు సంబంధించిన పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన ఈపీఎఫ్‌వో పరీక్షకు 2482 మందికి గానూ 1882 మంది, సాయంత్రం జరిగిన ఈఎస్‌ఐసీ పరీక్షకు 3247 మంది గానూ 1049 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్లు

మురళీనగర్: ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో భాగంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆదివారం ముగిశాయి. వెబ్ ఆప్షన్లను సోమవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఎంపిక చేసుకోవాలని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 13వ తేదీన వెబ్ ఆప్షన్లు మార్చుకోవచ్చు. ఈ నెల 16న సీట్లు కేటాయింపు, 17 వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.